# తారుణ్యపు తొలిరోజులు

వరలక్ష్మి 'టీ'కి ఆహ్వానించగానే క్లాసులోంచి ఎగిరి గంతేసిన ముగ్గురిలోనూ కూర్మారావు లేడు. లేకపోగా అతగాడు కల్యాణి పంపిన శుభలేఖార్థములన్నా చూసుకోకుండా- కార్డు మడిచి ప్రక్క జేబులోకి తోసి అత్యంత శ్రద్ధాభక్తులతో ఉపన్యాసాన్ని వింటూ పాఠాలు నోటు పుస్తకంలో వ్రాసుకుంటూ వుండిపోయాడు క్లాసులో. ఈ బుద్ధిమంతుడి బాగుపడే లక్షణాల్ని బయట నుంచి చూస్తున్న ముగ్గురు మిత్రులలోనూ ఒకడైన కొండలరావు యిక వుండబట్టలేక యివతలి కిటికీలోంచి "బయటికి రావోయ్ బాజమ్మా!" అని అనేక రకాలుగా అభినయంచేసి ప్రయత్నించి చూశాడు, కూర్మారావుకోసం. ఈ సర్వాంగాభినయాలు ఒక్క కూర్మారావు మినహా అందరూ చూసి సానుభూతిపరులైన కొందరందులో కూర్మారావుని తట్టి కిటికీవైపు 'నీ మిత్రుడడుగో' అంటూ అతని దృష్టిని మరల్చేసరికి కొండలరావు జేబులోంచి వరలక్ష్మి చేత పంపబడినటువంటిదిన్నీ, పరిచారికాహస్తాల్లోంచి వూడిపడినటువంటిదిన్నీ తన శుభలేఖను చూపిస్తూ 'ఏం! నువ్వు టీకి రావా-' అని సాంకేతికంగా అడిగాడు. కూర్మారావు అధ్యాపకునివైపు చూపించి 'యముడల్లే ఈయన పాఠం చెప్పుకు పోతుంటే ఎట్లా రావట'మని నీరసంగా జవాబిచ్చాడు.

కొండలరావు పళ్లు పటపటా కొరికి 'చావు ఐతే' అంటూ నిష్క్రమించాడు.

'పరసతి గర్భవేదన, వివాహము, విత్తులు జల్లు కార్తియున్, గురువులరాక, దాదిమృతి' అన్నట్లుగా కూర్మారావు తన మిత్రులకు కోపం వచ్చేటటువంటి యింకో తెలివి తక్కువ పని చేశాడు పరసని.

వరలక్ష్మి 'టీ'కని పిలిస్తే అపురూపంగా, వెళ్లక-కొండలరావుదగ్గర ఇదివరకు చేబదులు తీసుకుని పదిరూపాయలు హరించివేసిన 'సముద్రాలు' గాడితో సినిమాకు వెళ్లాడు. అది చట్ట విరుద్ధమే గాకుండా, మహా తీవ్రమైనటువంటి అపరాధం కూడాను. హిమవత్పర్వతంతో సరిసమాన ప్రతిపత్తి గలిగిన యీ కళాశాలలోని ఆడపిల్లల వెయిటింగ్ శాల అనే మానస సరోవరంలో-విహరించే- వరలక్ష్మివంటి లలనా మణులనే రాజహంసలతో ఒక్క చిన్న పలుకుకోసం కులికే అనేక వేలమంది కొక్కిరాయిలకు లభించని అపురూపమైన అవకాశాన్ని కూర్మారావు చేతులారా వదులుకొని మణివదలి మసిబొగ్గుకోసం దేవులాడినట్లుగా యీ వెధవ 'సముద్రాలు' గాడితో సినిమాకి వెళ్ళకపోతే ఏం పుట్టిమునిగింది? అనుకున్నారు కొందరు సానుభూతిపరులు.

ఏమీ ఎరగనివాడిలా తలకాయ ఒక ప్రక్కకు వాల్చి గబగబా రెండుమూడు పెద్ద పెద్ద అంగల్లో గదిలోకి వచ్చిపడి, సబ్బుబిళ్ళా తువ్వాలు పుచ్చుకుని నూతివైపు ఉడాయించబోయాడు.

అప్పటికే గదిలో వుండవలసిన వాళ్ళంతా చేరి ఒక మహాజనసభ సాగిస్తున్నారు. కొండలరావు లేచి 'ఆగవోయ్ ఆగు' అని గర్జించాడు.

'నువ్వు పేరంటానికి రాలేదేమని వరలక్ష్మి అడిగింది సుమా!' అన్నాడొక యీర్ష్యాపరుడు. నలుగురూ గొల్లుమన్నారు.

పురాణం సుబ్రహ్మణ్య శర్మ

మరొకడు– 'నీ వాయినం మా కొండలరావుకి ముట్టింద'న్నాడు.

'ఏం వస్తామనా లేచిపోయావిదే సందని సినిమాక'ని విసిరాడింకో మహాత్ముడు. ఈ విధంగా నలుగురూ నాలుగు మాటలు రువ్వారు. అన్నీ విన్నపిదప 'మీరు వెళ్లారు చాలదూ- నేనెందు కక్కడికి!' అని అవతలకు దూసుకొపోతూండగా కొండలరావు——

'రేపైనా క్లాసులో ఎక్స్‌క్యూజ్ చెప్పుకుంటావా—— ఒకటికి రెండు సార్లు అడిగింది కూడాను.' అన్నాడు.

'ఎందుకు ఎక్స్‌క్యూజ్-' అన్నాడు వెళ్లబోతూ.

'సినిమాకు వెళ్లినందుకు గాదు, టీ పార్టీకి రానందుకు.'

'రాకపోతే చెప్పాలా?' ఇంకా సందేహంగానే అడుగుతూండగా నవ్వి– 'మరి ఒకటికి రెండుసార్లు నువ్వు రాలేదేమని అడిగినప్పుడు మర్యాదగా నువ్వు సంజాయిషీ చెప్పుగోవద్దూ' అని బలపరిచాడు కొండలరావు. మరొక మిత్రుడు లేచి- 'స్వయంగా పిలవలేదని రాలేదనుకున్నదా అమ్మాయి' అన్నాడు.

"స్వయంగానే - అమ్మ బాబో! యింకేమన్నా వుందా?" అన్నాడు కొండలరావు.

'ఆహా' అని కళ్ళు పెద్దవిచేసి ఆశ్చర్యమభినయిస్తూ 'ఏం వోయి కూర్మం, ఆడదంటే నీ కంత భయమా?' అని అడుగుతూ సమాధానం కోసం నిరీక్షించకుండానే ఫక్కుమని నవ్వేశాడు మరొక సాహసుడు.

కూర్మారావుకి కంపరమెత్తింది.

'నేను టీ పార్టీకి రానందుకు వరలక్ష్మికి క్షమాపణ చెప్పకోవటం మర్యాద అన్నారు గదా - టీ పార్టీకి రాని కారణానికి నన్నిట్లా ఆడదంటే బిడియమని మాటలనడం మర్యాదేనా మీకు?' అని అడుగుదా మనుకొన్నాడు. అనుకుంటూ వుండగానే మాట గొంతుకలో నిల్చిపోయింది.

'టీపార్టీకి రాకపోవటం, అందులో వరలక్ష్మి వంటి నీరజాలేక్షణ పిలిచినపుడు మానటం, కేవలం నువ్వు ఏ శుకమహర్షివో అనిపిస్తోంది'అన్నాడు దీర్ఘాలు తీస్తూ కొండలరావు.

కూర్మారావు కళ్లలో గిరుక్కున తిరిగిన నీళ్లు ఆ కన్నీటి కదలికల వాగురలో పడి ఆ మత్తకాశిని పంపిన శుభలేఖ. కొట్టుకొని పోయింది. చిన్నబుచ్చుకున్న ముఖంతో నూతివైపు మరలి స్నానాని కుపక్రమించాడు. వొళ్లెరుగకుండా ఎన్ని చేదలు తోడి మీద పోసుకున్నాడో లెక్కలేదు. ఆ అమ్మాయి తన్నెందుకు ఆహ్వానించాలి? పిలిచెబో, తానెందుకు వెళ్లటానికి భయపడాలి? పడ్డాడయ్యా - మనకెందుకని వూరుకోక యీ మూకంతా తన్నెందు కేడిపించాలి? అసలింతకీ సముద్రాలుతో సినిమాకి వెళ్లటం నేరమైంది.' ఇట్లా అనుకుని స్నానం పూర్తిచేసి చూసేసరికి సబ్బుబిళ్ల సగం అరిగిపోగా, యింటాయన కూర్మారావు తోడిపోసిన నీళ్లన్నిటినీ, బోదెలగుండా మొక్కలకు పెడ్తున్నాడు. ఇంక ఆ రాత్రికి భోజనంచెయ్య మనసొప్పలే- ఎకాయెకీ దుస్తుల్ని మార్చుకొని కూలబడ్డాడు మంచంమీద. దీపం తలవైపుకు లాక్కుని పుస్తకంలోని అక్షరాల్ని మింగటానికి ప్రయత్నించాడు. అదేమి పాపమో! ఒక్క పేజీకూడా మింగుడు పడకమునుపే కళ్లముందు వరలక్ష్మి తాండవ మాడసాగింది. ఆ అమ్మాయి వెనువెంటనో పటాలం వుంది. అందరి చేతుల్లోనూ పుస్తకాలున్నాయి. వాళ్ళందరూ రంగురంగుల చీరలు కట్టుకున్నారు. ఆ కట్టుకునే వైఖరిలో మార్పు కనబడింది. కూర్మారావు ఆశ్చర్యపోయాడు. మును పొకసారి తన పెద్దక్క ఫొటో తీయించుకుంది. అందులో ఆవిడ ఎట్లా చీర కట్టుగున్నదీ ఆ వైఖరిని జ్ఞాపకం చేసుగోవటానికి ప్రయత్నించాడు. ఆవిడ పద్ధతి చాలా అధునాతనమైనదని వాళ్ల అమ్మమ్మ సాధిస్తూ వుండేది. కూర్మారావు కట్టెదుట అధునాతన స్త్రీమూర్తుల పోలికలు తచ్చాడసాగాయి. మళ్లీ ఆమనఃఫలకంమీద వరలక్ష్మి పటాలం ప్రత్యక్షమయింది. వాళ్లందరూ కిలకిలా నవ్వుతున్నారు. ఇంగ్లీషులో కేరింతలు కొడుతున్నారు. ఇంక వాళ్ల ఆకారరూపురేఖాదు లెట్లాగున్నయ్యంటే శరీరంయొక్క కుడి భాగవరకూ లోగలి జాకెట్టు బిగువులు లోకానికి ప్రత్యక్షమయ్యే రీతిలో ముందు కుచ్చెళ్ళతో సహా అయాచిత నేత్రోత్సవం యివ్వబడుతోంది. ఆ పమిట చెరగు ఎంత

పొట్టిగా వొంటిమీద ఆనీఆనకుండా వుంటే అంత మంచిది. వాళ్లందరూ కాళ్ళకు పట్టాలు కట్టుకోవడంలాంటి వెర్రి పనులేమీ చేయలేదు. ఆ చీరకుచ్చెళ్లు మునుపు కాలేజీ కుర్రవాళ్లు తొడిగేలంబాడీ పైజమాలను వెక్కిరిస్తున్నయ్యా అన్నట్లుగా రోడ్లనూడుస్తున్నాయి. వాళ్ల తెవికల చేతులు బాగా బిగ్గా వాటి నంటిపెట్టుకుని పొడుగ్గా వున్నాయి. ఇంకో తమాషా ఏమిటంటే వరలక్ష్మి పటాలమంతా మెడలో కాకుండా కంఠసీమను పాములవాళ్ళకు మల్లే పూసల పేరులు అలంకరించుకున్నారు—అదీ యించుమించు పట్టెడకు మల్లే గొంతుకను చుట్టి వేసుకుని బిగ్గా పుస్తెలతాడుని స్మరింపజేసేట్లు. కొంత మంది మత్తకాశినీమణులు చాలా సన్నితమయిన పల్చటి చీరల్ని చుట్టుగుని లోపల చిన్న చిన్న లేసు పరికిణీలు కట్టుకున్నారు. ఎత్తు మడమల జోళ్లు తొడుక్కుని సవిలాసంగా కాళ్లు దగ్గరెట్టుకు నడుస్తున్నారు. కూర్మారావు మనఃఫలకంమీద వరలక్ష్మి వచ్చి నిల్చింది. ఆ అమ్మాయి వయస్సెంత వుంటుందో అని వూహించాడు. కాని స్త్రీ వయస్సూ, పురుషుడి జీతం అడిగి తెలుసుకోకూడదుగదా అనుకొని మళ్లీ తిన్నగా పస్తాయించి చూశాడు. వరలక్ష్మి గడియారాన్ని కుడిచేతికి పెట్టుకుని మాటిమాటికి టైము చూసుకుని నవ్వుతోంది. కూర్మారావు తనచేతికేసి చూసుకుని పెళ్లైతే తనకి వస్తుందిగదా గడియారమనుకుని తృప్తిపడ్డాడు. ఈలోగా యింకో చిత్ర మతనికి తట్టింది. అనేకమంది కుర్రవాళ్లు యీ యౌవతసమూహంకేసి విభ్రాంతులై చూస్తూ వెకిలినవ్వులునవ్వుతూ తిరుగుతున్నారు. వాళ్లంతా సిల్కు చొక్కాలు, వులెను లాగులు, ప్లాస్టికు జోళ్ళమీద నడుస్తున్నారు. ఒక్కొక్క కుర్రాడి చేతిలో ఒక్కొక్క సైకిలుంది. కొందరి చేతుల్లో కెమేరాలున్నై. ప్రతివాడి చేతిలోనూ ఒక సిగరెట్టు తప్పకుండా కాల్తోంది. ఈబొమ్మ చెరిగిపోగానే బ్రహ్మరథంవంటి జట్కాలు రెండు బయలుదేరినై. ఈ మత్తకోకికలూ మత్తేభలంతా వాట్లలో సర్దుకున్నారు. ఆవిధంగా అరుణరథం బయలుదేరగానే కుర్రవాళ్లు స్వయంవరానికి సిద్ధమయి పోటీలకు దిగే రాజకుమారుల్లా సైకిళ్లమీద ఆసనాలు వెయ్యనారంభించారు. అందుంచ కొందరు-బిగ్గరగా వాక్చమత్కృతిని ప్రకటిలోటంకోసం 'విట్లూ హ్యూమరు' విరివిగా ఏకరువు పెడుతున్నారు. మరికొందరు జట్కా ముందరవున్న గడ్డిపరకల్ని తీస్తూ కనీసమూ నవకోమలాంగులు తమతమ హాస లీలావినోద వీక్షణ కటాక్షములచేత తృప్తిపరుస్తారేమో అని ఆశపడుతున్నారు. మరికొందరు నోటుపుస్తకాన్ని అమ్మాయిలకు అందిస్తున్నారు. ఇంతెందుకు ఉచితంగా వారికి కావలసిన ఏ సౌకర్యమైనా చెయ్యటానికి సిద్ధంగా వున్నారు. కొంతమంది అధ్యాపకులే యీకుర్రవాళ్లతో పోటీచేస్తూ రావటాన్ని కూడా కూర్మారావు గమనించాడు. క్రమంగా యీ కలలన్నీ చెదరిపోగా తెల్లవారుజామున మూడింటికి నిద్ర పూర్తిగా వశపర్చుకో గలిగింది, కూర్మారావును.

* * *

చేమకూరాయన చెప్పినట్లుగా అసలు క్లాసులోకి కుటిలాలకలు కాస్త రావటం గనుక ఆలస్యమైతే ఉపన్యాసకులేమిటి విద్యార్థులేమిటి మనస్సులు మనస్సుల్లో వుండకపోవటం వలన డోలాయమానమానసులై ఏదో కసిగాట్లుగా పాఠాల్ని నముల్తూ-'ఎక్కడచప్పుడైన తరలేక్షుళ వచ్చె నటంచు లేచు నే దిక్కున అల్కిడైన' వరలక్ష్మి పటాలమే కాబోలని చూస్తూవుంటారు. ఆతరువాత 'కంగుల్ దీరిన పైరిణీ అవిక ...... రాణింపగా, చెంగల్వ తెన్నెరికొప్పునందు నొఱపై చెంతం గుబాళింపగా, బంగారందియ ముక్కునం దిమిడిపై పైనంచయల్లింపగా, సింగారంబుగ ముద్దు జిల్కులు' కులుకుతూ కులుకుతూ నడచివచ్చి అంటెండెన్సు చెప్పగా ఉపన్యాసకుడికి ఓ విధమైన మనశ్శాంతి.

కొండలరావులాంటి విద్యార్థులు ఆ కొందరికి జీతాలు కట్టిపెడుతూ, లెక్కలు చేసిపెడుతూ, నోట్సులు రాసిన పుస్తకాలు పట్టినే సమర్పించుకుని, లైబ్రరీలోంచి పుస్తకాల్ని తెచ్చి యిస్తూ అనేక రకాలుగా ఏమీ ప్రతిఫలమాశించకుండా మహాత్యాగబుద్ధితో సేవలు చేస్తూంటారు.

ఈవిధంగా అమ్మాయిలను సేవించటాన్ని కాలేజీ పరిభాషలో కాకా పట్టడమని వాడుతారు. కొందరు ఉపన్యాసకులూ అమ్మాయిలకు

కాకా పట్టడానికి వెనుదీయరు. ఈ కాకా పట్టే వాళ్ళలో ఉపన్యాసకుల్లో ఉపన్యాసకులు, విద్యార్థులలో విద్యార్థులు, అధికారవర్గాలలో అధికారవర్గాలు, గుమాస్తాల్లో గుమాస్తాలుగా యిన్ని రకాలుగానూ వుంటారు. అది ఏమంత తప్పుగాదు. ఎందువల్లనంటే లోకంలో నీఅంత వాడు లేడంటే ఉబ్బినట్లుగా, అందువల్ల పని జరిగినట్లుగా యిక దేనివలనా కాదు కాబట్టి. ఈ కాకా బట్టేవాళ్ళలో ఒకళ్ళను చూస్తే మరొకడికి యీర్ష్యగా వుంటుంది.

వరలక్ష్మికి కొండలరావు కాకా బడతాడు. కొండలరావుకి రూమ్మేటు కూర్మారావు. అటువంటి సందర్భంలో కూర్మారావు వరలక్ష్మి ఆహ్వానాన్ని తిరస్కరించడమే గాకుండా సముద్రాలు గాడితో సినీమాకు వేంచేశాడంటే। ఆ అవమానం నిజంగా వరలక్ష్మిది గాక తనదిగా భావించుకుంటున్నాడు కొండలరావు. । కొండలరావు అచ్చంగా కాకారావు.

ఈ సంఘటన శుక్రవారంనాడు జరగటం వలన వార్తల్ని సోమవారం దాకా ప్రచారం చెయ్యటానికి వీలుపడింది కాదు కొండలరావుకి.

శనివారం ఉదయానికల్లా కూర్మారావు బుజ్జి కాళీ అయింది. బజారులో సిరా, ఒక పెనసలు, టూతుపేస్టు కొనవలసుండి తొమ్మిది గంటలకు చిల్లర డబ్బులు, ఒక ఐదురూపాయలనోటు జేబులో వేసుకొని ఫ్యాన్సీస్టోరుకి బయలుదేరాడు. ఇంకా తిన్నగా వీధిమలుపు తిరక్కుండానే పోస్టు మనిషి ఆపి ఓ ఉత్తరమిచ్చిపోయాడు. ఉత్తరం చింపుకుని మలుపు తిరిగే లోపుగా సిటీబస్సు చెక్కేసింది. అరె! అనుకుని ఉత్తరం చదువుకుంటూ మెల్లగా నాలుగురోడ్ల కూడలిలోకి వచ్చేసరికి చదివే వుత్తరమూ పూర్తయింది, కడుపులోని ప్రేగులు జాలిగా అరవనూ అరిచాయి. ఒక చిన్న కాఫీహోటల్ను ఆశ్రయించగా మనుగుడుపు పెండ్లికొడుకు మాదిరి పదార్థాల్ని లోబర్చుకొని ఆకల్ని జయించటం జరిగింది. దీన్తో ఒకవిధమైన శాంతి యేర్పడగా తండ్రి వ్రాసినవుత్తరాన్ని తిరిగి చూసుకున్నాడు. 'ఐనింటిపిల్ల – మనకు కావలసిన సంబంధమొకటుంది. నువ్వా పిల్లను చూద్దుగాని వెంటనే బయలుదేరి రావలసింది' అని దాంట్లోని తాత్పర్యం. మెల్లగా నవ్వుకుని బిల్లు చెల్లించి కాఫీ హోటల్లోంచి బయటపడి ఫ్యాన్సీస్టోరు వెదుక్కుంటూ కిల్లీ దుకాణాన్ని దాటి ఒక అందమైన షాపులోకి దూరబోయాడు.

అతని నడకకు అవరోధం కలిగింది. తలెత్తి లోపలకు చూసేసరికి వరలక్ష్మి ఏవో యిన్ని సబ్బు బిళ్లలు - రిబ్బనులు - రబ్బరు ప్లాస్టిక్ గాజులు కొంటున్నదల్లా తన వైపు తిరిగి 'ఓహ్హో! మీరా' అని పల్కరించింది. చచ్చాంరా భగవంతుడా అనుకొన్నాడు.

అప్పుడా అమ్మాయికి నమస్కారం చెయ్యాలో, పాదాభివందనం చెయ్యాలో, కరచాలనం చెయ్యాలో వైనమేమీ తెలిసిరాక కూర్మారావు కొద్దిగా కంగారు పడుతూ-

'ఎక్స్క్యూజ్, మీ' అని తలకాయ వంచుకున్నాడు. దేనికని అదోలా కళ్ళు చిటిమింది ఆ అపూర్వసుందరి. ఆ అమ్మాయికి కళ్లు చిటిమే అలవాటుంది.

'అహాఁ. నిన్న మీరు పిలిచినప్పుడు వేరే పని తొందరలో రాలేకపోయాను.' అని నసిగాడు. ఆ అమ్మాయి పమిటను మోచేతిక్రింద నుంచి బిగ్గా లాగుతూ-

'అవును మీరు రాలేదు' అని నవ్వింది. ఈలోగా షాపువాడు బిల్లు వరలక్ష్మి చేతిలో వుంచినప్పుడు ఆమె పర్సులో డబ్బు తీసుకుంటూండగా ధైర్యంచేసి ఆమెకేసి చూసాడు. కూర్మారావు వొళ్ళు జలదరించింది. మళ్ళీ ఆ అమ్మాయి పదిరూపాయల నోటు కూర్మారావు ముందరాడిస్తూ 'రెండు ఐదురూపాయలుంటే యివ్వండి' అంది. 'లేవు, ఒక్క అయిదురూపాయల నోటుంది'అని జేబులో చెయ్యి వుంచాడు. 'సరే - అదే యివ్వండి. మీకు రేపు నేను క్లాసుకొచ్చినపు డిస్తాను.' అని కూర్మారావు చేతిలోని నోటు నందిపుచ్చుకుని। వస్తుసముదాయాన్ని జట్కాలోకి పంపుతూ 'పోనీ! మీరు సాయంత్రం అల్లా రాకూడదూ' అని అడిగింది. 'వూరు వెడ్తున్నా'నని వెనక్కి తిరిగొచ్చాశాడు. టూతుపేస్టు-సిరా-పెనసలు కొనకుండానే-కొనడానికి విత్తం లేదు!

ఆ మర్నాడు కూర్మారావు తండ్రిని కలుసుకోగా; ఆ పెళ్లి కూతురిదికూడా యీ వూరేనని

తేలింది. తరువాత ఆ అమ్మాయి ఇప్పుడు గావటానికి పరీక్ష చదువు లడ్డమొచ్చినట్లుగా తాజా వార్త అంది, కూర్మారావు ప్రయాణాన్ని వ్యర్థపరిచింది. విసుక్కుంటూ మర్నాడు వచ్చిన దారిని స్వగ్రామంలో ఆగకుండా వుడాయించాడు.

* * *

'ఓహో! మీరు పూర్తిగా లేనట్లుందే యీ మధ్య'- అంది ప్రత్యేకంగా క్లాసు వదలిన తరువాత వరండాలో తచ్చాడుతూన్న సహాధ్యాయి కూర్మారావు నుద్దేశిస్తూ చపలాక్షి వరలక్ష్మి. 'అవునండీ స్వగ్రామం వెళ్లాను' అన్నాడు ముక్తసరిగా.

'సాయంత్రం తప్పకుండా కాఫీ పుచ్చుకోవాలి మాయింట్లో-' అని బలవంత పరిచింది సహాధ్యాయిని. తప్పించుగోడానికి తగినంత కారణం దొరక్క 'సరే- థాంక్స్.' అని లైబ్రరీలోకి జారాడు.

సరిగా ఐదున్నరకు వరలక్ష్మి హాస మధువుతో బాటు కాఫీ గూడా అందుకున్నాడు కొద్దిగా బిడియపడుతూ. కూర్మారావుతో కాస్సేపు చదువుకు సంబంధించిన విషయాలు మాట్లాడినమీదట ఆ అమ్మాయి 'మొన్న మీదగ్గర తీసుకున్న సొమ్ము యివ్వటంలో ఆలస్యం జరిగింది. మీరేమన్నా యిబ్బంది పడి వుంటారేమో- క్షమించాలి.' అంటూ ఐదు రూపాయల కాగితాన్ని అతనిముందు వుంచుతూ 'మీవూరు చెప్పారు కాదు?' అంది, 'శివపురం' అన్నాడు. 'అహాఁ' అని ఆకిల్ల బుగ్గలు సొట్టలుపడేలా నవ్వుతూ 'మా పెత్తల్లి మొన్ననే నాలుగు రోజు లుందుగాని రమ్మంటూ వ్రాసింది. పరీక్షలని వెళ్ళటం మానుకున్నాను. ఏమనుకుందో...' వ్యంగ్యంగా అంది. కూర్మారావు చేతిలోని కాఫీ తొణికి కొంత నేల మీదా, కొంత వరలక్ష్మి చీర కుచ్చెళ్ళ మీద వొలికింది.

ఆ అమ్మాయి కాలు వెనక్కు లాక్కుని చీరపిండుతూ తెలతెల బోయింది.

అతను వెలవెలబోతూ కాఫీ త్రాగకుండా గ్లాసు బల్లమీద వుంచాడు. కొన్ని క్షణాలు పదునుగా మౌనంగా దూసుకున్నాయి. కొంత అధికారంతో-

'మరి మీరు వెళ్లకపోయారా- యిక్కడ టీపార్టీలు విందులు పరీక్షల కడ్డం రావనుకుంటాను.' అని అనగలిగాడు. వరలక్ష్మి తలకాయ మీద కొండంత బరువుంచినట్లుగా తడబడుతూ 'పొరపాటు జరిగింది - మా పెత్తల్లికోపమొచ్చి వుంటుంది' అంది. గ్లాసులో మిగిలిన కాఫీ పొగలు గ్రక్కుతోంది. మళ్ళీ కటువుగా అన్నాడు: 'పల్లెటూళ్లలో మీకేమీ తోచక పోవచ్చు - అవునా?' అని. కూర్మారావు కేసి చూడలేక చూడలేక 'పొరపాటు' అంటుండగా 'నేనువస్తాను' అంటూ లేచాడు కూర్మారావు. వ్యంగ్యం ముదురుతోంది,

గుమ్మందాకా సాగనంపటానికి తనూ లేచి నిశ్శబ్దంగా అడుగులో అడుగులేస్తూ బొటన వ్రేలికేసి చూసుకుంటూ 'నేను వెళ్లలేదు- వెళ్లక పోవటం అపరాధమే-' అనుకుంది తనలోతాను. గేటుతలుపు తెరిచి అవతలవైపుకు తిరిగి నుంచున్న కూర్మారావు మనస్సు తేలికై పూల పొట్లంలా వున్న వరలక్ష్మి గుండ్రని చేతులను యివతలనుంచి అందుకుని 'మేం గ్రామీణులం. మోటువాండ్లం అవునా ?' అంటూ ఆమె కళ్లలోకి సూటిగా చూస్తూ నవ్వాడు. పల్లకీ దిగి మధురమైన లజ్జతో ప్రాణనాధుని వ్రేలి నందుకొని పాదం గుమ్మంమీద వుంచే క్రొత్త పెండ్లికూతురిలా సిగ్గుపడుతూ- అతని చేతుల్లోంచి చేతులను లాక్కుని వెనక్కు తిరిగి సంభ్రమముతో, ఆనందంతో, కలగాపులగమైన మనస్సుతో వరండాలోకొచ్చి కుర్చీలో కూలబడి పోయింది.

కూర్మారావు నోటు, గాలికి రెపరెపలాడుతూ బల్లమీద గారడీలు చేస్తూండగా, వరలక్షి పొగలు గ్రక్కుతున్న ఆ యొక్క కాఫీ శేష భాగాన్ని ఆప్యాయంతో తాగేసింది.